ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

5

గురువారం 29 ఫిబ్రవరి 2024

మేడారం వైభవం వెయ్యేళ్లు గుర్తుండేలా కృషి

- అధికారుల సమన్వయంతో జాతర విజయవంతమైంది
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి ట్రైబల్ వర్సిటీలో అడ్మిషన్లు
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి జ్ఞాపిక అందిస్తున్న మంత్రి సీతక్క

7


సమ్మక్కగుడిలో ముగ్గులు వేస్తున్న మహిళలు


సమ్మక్కగుడి వద్ద యాటలతో మొక్కులు చెల్లించుకుంటున్న పూజారులు





ఘనంగా తిరుగువారం

- మేడారం మహాజాతరలో చివరి ఘట్టం పూర్తి
- ప్రత్యేక పూజలు చేసిన వడ్డెలు.. భారీగా హాజరైన భక్తులు
- మొక్కులు చెల్లించుకునేందుకు తరలొచ్చిన జనం

చివరి ఘట్టం ఘనంగా ముగిసింది. కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవాలైన మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర పరిసమాప్తమైంది. చివరి వేడుక అయిన తిరుగువారం పండుగ బుధవా రం వైభవంగా జరిగింది. ఈ సందర్భం గా ఆదివాసీ పూజారులు ఇలవేల్పులైన సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల ఆలయాలను శుద్ధి చేశారు. అలుకు పూతలతో మహిళలు తీర్చిదిద్దారు. ఇష్టదైవాలకు మొక్కుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు యాట మొక్కులు తీర్చుకున్నారు. కాగా, తిరుగువారం పండుగకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో మేడారం పరిసరాలు సందడిగా కనిపించాయి. జంపన్నవాగులో స్నానం చేసి అమ్మవార్ల గద్దెలకు మొక్కుకున్నారు.

- మేడారం



'మేడిగడ్డ' మే సవాల్!

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ బాహాబాహీ

- కాంగ్రెస్‌కు రాజకీయాస్త్రంగా పిల్లర్ల కుంగుబాటు
- ప్రతి దాడికి సిద్ధమైన 'గులాబీ'దళం
- రేపు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల 'చలో మేడిగడ్డ'
- కేటీఆర్, హరీష్‌రావు సహా కీలక నేతల రాక
- 2న కరీంనగర్ సభకు హాజరవనున్న కేసీఆర్
- లోక్‌సభ ఎన్నికల వేళ రాజుకుంటున్న మేడిగడ్డ వేడి

వరంగల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడిగడ్డ పోరుగడ్డగా మారుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌పై తొలి నుంచి వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్.. అనూహ్యంగా అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవటంతో దాన్ని అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా మలచుకుంది. స్వయంగా కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ మేడిగడ్డ బ్యారేజీకి వెళ్లి పరిశీలించారు. రూ.లక్ష కోట్ల వరకు ఖర్చు చేసి కట్టిన ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని కాంగ్రెస్ దుమ్మెత్తి పోస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ కూడా ఎదురుదాడికి దిగుతోంది. మూడు పిల్లర్లు కూలితే ప్రాజెక్టే పనికి రాదంటున్నారని అసహనం వ్యక్తం చేస్తోంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్‌కు దీటుగా చలో మేడిగడ్డ పేరుతో మార్చి 1న బీఆర్ఎస్ తన ప్రజాప్రతినిధులతో కలిసి మేడిగడ్డ బ్యారేజీ పర్యటనకు సిద్ధమవుతోంది. ఇలా రెండుపార్టీల నేతలు 'మేడిగడ్డ'మే సవాల్.. తేల్చుకుందాం అంటూ మాటల తూటాలు పేలుస్తుండటం.. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి.

అందరిచూపు మేడిగడ్డ వైపే..

సుమారు రూ.98వేలకోట్లు ఖర్చు చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీ అత్యంత కీలకమైనది. అయితే గత ఏడాది అక్టోబరు 21న రాత్రి బ్యారేజీలోని 7వ బ్లాక్‌లో 21వ పిల్లర్ పెద్ద శబ్దంతో కుంగిపోయింది. అసెంబ్లీ ఎన్నికల సమయం కావటంతో ప్రతిపక్షాలకు మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు ప్రచారాస్త్రంగా మారింది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. ఏకంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని నవంబరు 2న మేడిగడ్డకు తీసుకెళ్లిన కుంగిన బ్యారేజీని చూపించి, నాణ్యత లోపంతో బ్యారేజీ కుంగిందని, కాళేశ్వరం కమీషన్ల ప్రాజెక్టుగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. అదే సమయంలో బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, లక్ష్మణ్ లాంటివారు సైతం మేడిగడ్డను సందర్శించి విమర్శలు గుప్పించారు. నవంబరులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మేడిగడ్డ బ్యారేజీపై మరింతగా దృష్టి పెట్టి బీఆర్ఎస్‌ను ఇరుకాటంలో పెట్టింది.

గత ప్రభుత్వ వైఫల్యాలపై కాంగ్రెస్ ఫోకస్







కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత బ్యారేజీ కుంగుబాటుపై వేగంగా విచారణ మొదలైంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోడంపై సీఎం రేవంత్‌రెడ్డి సీరి యస్‌గా తీసుకున్నారు. ఈ వైఫల్యం వెనుక కేసీఆర్ ప్రభుత్వంలో బాధ్యులు ఎవరు అనేదానిపై ప్రధానంగా ప్రభుత్వం దృష్టిపెట్టింది. దీంతో డిసెంబరు 11వ తేదీన భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో జలసౌధలో నీటిపారుదశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజె క్టు రిపోర్టు మొత్తం తమకు సమర్పించాలని అధికా రులను ఆదేశించారు. ఆ తరువాత 16వ తేదీన శాసన మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని ప్రకటించారు. 17వ తేదీన నీటిపారుదలశాఖ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్ష చేశారు. డిసెంబరు 18వ తేదీన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్లు మురళీధర్, నల్లా వెంక టేశ్వర్లు, బి.నాగేంద్రతో పాటు ఎల్‌అండ్‌టీ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ దేశాయ్ తదితరులతో మేడిగడ్డపై సమీక్ష నిర్వహించారు. డిసెంబరు 29వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి కుంగిన ప్రాంతాన్ని పరిశీలించింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఫిబ్రవరి 7వ తేదీన ప్రాజెక్టులో భాగస్వామ్యమైన ఈఎన్‌సీలు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లుపై ప్రభుత్వం వేటు వేసింది. ఫిబ్రవరి 13న సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా మేడిగడ్డలో పర్యటించారు. మంత్రులతో పాటు కాంగ్రెస్, సీపీఐ, ఎంఐఎం ఎమ్మెల్యేలతో కలిసి మేడిగడ్డను సందర్శించారు. వరుసగా ప్రభు త్వం మేడిగడ్డపై ఫోకస్ చేసింది. మేడిగడ్డ కుంగిపోవటంతో బ్యారేజీని పునరుద్ధరించటం కష్ట మని, దీనికి ప్రత్యామ్నాయంగా ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టును పునరుద్ధరి స్తామనే సంకేతాలను ప్రభుత్వం ఇస్తోంది. లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్టుతో కనీసం లక్ష ఎకరాలకు కూడా సాగు నీరు ఇవ్వలేదని కాంగ్రెస్ ఆరోపణలు చేస్తోంది.







కౌంటర్‌కు 'గులాబీ' సన్నాహాలు

మేడిగడ్డ బ్యారేజీ కుంగుపాటుపై ప్రభుత్వం వరుసగా విచారణలు, సమీక్షలు, సీఎం, మంత్రులు పర్యటనలతో కాళేశ్వరం లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఫిబ్రవరి 13వ తేదీన సీపీఐ, ఎంఐఎం ఎమ్మెల్యేలను కూడా మేడిగడ్డకు తీసుకరావటంతో గులాబీ పార్టీ సంది గ్ధంలో పడింది. మౌనంగా ఉంటే కాళేశ్వరంపై ప్రభుత్వం, కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం

మిగతా 6వ పేజీలో..

టార్గెట్ ఎంపీ ఎన్నికలు

వచ్చే లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు వ్యూహాత్మంగా మేడిగడ్డ బ్యారేజీ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయనే ప్రచారం సాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, జహీరాబాద్, నల్లగొండ, భువనగిరి లోక్‌సభ పరిధిలోని రైతాంగానికి సాగు నీరు అందాల్సి ఉంది. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవటంతో ఎత్తిపోతలు నిలిచిపో యాయి. అంతేకాకుండా ప్రాజెక్టు పనులు కూడా నిలిచి పోయాయి. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు పనికిరాదని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం ప్రజల్లోకి వెళుతుండటంతో గులాబీ పార్టీ కౌంటర్ పాలిట్రిక్స్‌లోకి దిగింది. మూడు పిల్లర్లను పునరిద్ధరిస్తే సరిపోతుందని, కేసీఆర్‌కు పేరు రావద్దని కాంగ్రెస్ నాటకాలు ఆడుతోందని ఆరోపిస్తు ఎన్నికల్లో ప్రచారానికి సిద్ధం అవుతోంది. దీంతో మేడిగడ్డ బ్యారేజీ ఎన్నికల పోరుకు అడ్డగా మారిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

పోలియో చుక్కలు వేయించాలి

డీఎంహెచ్‌వో మధుసూదన్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మధుసూదన్

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 28: ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ అన్నారు. మార్చి 3 నుంచి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమీకృత కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఐదేళ్లలోపు పిల్లలు జిల్లాలో 34,728 మంది ఉన్నారని అన్నారు. మార్చి 3 నుంచి 5 వరకు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను వేయనున్నట్టు తెలిపారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలతోపాటు మొత్తం 321 ప్రత్యేక కేంద్రాలు, 18 మొబైల్ పాయింట్లను ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. బస్టాండ్లు, జనసంచారం ఎక్కువా ఉండే ప్రదేశాల్లో పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిర్ణీత తేదీల్లో ఆయా కేంద్రాల్లో చుక్కలు వేయించుకోని పిల్లలకు మార్చి 6 నుంచి ఇంటింటికీ తిరిగి వేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ అన్వేషిని, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ములుగు అదనపు కలెక్టర్‌గా మహేందర్‌జీ

ఏటూరునాగారం ఎస్డీసీగా రామ్మూర్తి


సీహెచ్.మహేందర్ జీ

ములుగు, ఫిబ్రవరి 28: ములుగు అదనపు కలెక్టర్‌గా సి.హెచ్.మహేందర్‌జీ నియమితులయ్యారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్ట ల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ములుగులో పనిచేస్తున్న డి.వేణుగోపాల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ అయ్యారు. నూతనంగా నియమితులైన మహేందర్ జీ గతంలో ములుగు ఆర్డీవోగా పనిచేశారు. ఏటూరునాగారం ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.ఎస్.వెంకన్న స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవోగా బదిలీ కాగా ఆయన స్థానంలో అక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న వి.రామ్మూర్తి నియమితులయ్యారు.

భూపాలపల్లి ఆర్డీవోగా మంగ్లీ

భూపాలపల్లి కలెక్టరేట్: భూపాలపల్లి ఆర్డీవోగా మంగ్లీ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న రమాదేవి మెదక్ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. భద్రాచలం ఆర్డీవోగా ఉన్న మంగ్లీ భూపాలపల్లికి రానున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రైబల్ వెల్ఫేర్ డీఈగా రాములు

ఏటూరునాగారం రూరల్ : ఏటూరునాగారం ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ డీఈగా రాములు నియమితులయ్యారు. భద్రాచలం ఐటీడీఏ డీఈగా పనిచేస్తున్న ఆయ న్ను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. ఏటూరునాగారంలో డీఈగా విధులు నిర్వర్తించిన నవీన్ గత ఏడాది ఏసీబీకి చిక్కి సస్పెన్షన్‌కు గురయ్యారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉండగా రాములును నియమించారు. బుధవారం ఆయన విధుల్లో చేరారు.

రైతు సంఘీభావ ర్యాలీలో కాంగ్రెస్ నేతలు


రైతు సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: ఢిల్లీలో రైతాంగ సమస్యలపై పోరాడుతున్న రైతులకు సంఘీభావంగా హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన ర్యాలీలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. నిజాం కళాశాల చౌరస్తా నుంచి నెక్లెస్‌రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు ఈ నిరసన ప్రదర్శన కొనసాగింది. కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నూనేటి శ్యామ్, వాకిటి రామకృష్ణారెడ్డి, రాజిరెడ్డి, ప్రభాకర్, రామన్న, సుధాకర్, రమేష్, రాజబాబు, వెంకన్న, మల్లన్న, సాంబయ్య, శ్రీను, రాజు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ములుగు జిల్లాలో 203 మంది గైర్హాజరు


ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ములుగు, ఫిబ్రవరి 28: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 14 పరీక్షా కేంద్రాలలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరిగింది. నిమిషం ఆలస్యం నిబంధన ఉండటంతో ఉదయం 8గంటల నుంచే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అధ్యాపకులు వారిని క్షుణ్ణంగా తనిఖీచేసి లోపలికి అనుమతించారు. అన్ని కేంద్రాల వద్ద పోలీసులు 144సెక్షన్ విధించారు. 2074 మంది విద్యార్థులకు గానూ తొలిరోజు పరీక్షకు మొత్తం 203మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 1776మంది కాగా 119మంది, 298మంది వొకేషనల్ విద్యార్థుల్లో 84మంది పరీక్ష రాయలేదు. జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు.

భూపాలపల్లి జిల్లాలో 97 మంది గైర్హాజరు ..

కృష్ణకాలనీ (భూపాలపల్లి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఫస్టియర్‌లో 1848 మంది పరీ క్ష రాయాల్సి ఉండగా 97 మంది గైర్హాజరయ్యారని నోడల్ అధికారి దేవరాజన్ తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెకెండియర్ పరీక్షలు జరగనుండగా అందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.


ములుగు మండలం బండారుపల్లి మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

దొంగల ముఠా అరెస్టు

రూ.5.50 లక్షల విలువైన బంగారం స్వాధీనం

వరంగల్ టౌన్, ఫిబ్రవరి 28: జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడే ముఠాను వరంగల్ సీసీఎస్, ఏనుమాముల పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5.50 లక్షల విలువైన సొత్తును స్వాధీన పర్చుకున్నట్లు మామునూరు ఏసీపీ సతీశ్‌బాబు తెలిపారు. వరంగల్ ఏనుమాముల పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏసీపీ సతీశ్‌బాబు నిందితుల అరెస్టు చూపించి వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరికి చెందిన రాపోలు రామకృష్ణ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన కేతిరి కిరణ్, పప్పుల సంపత్ ముఠాగా ఏర్పడి ఏనుమాముల, పరకాల పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు

మిగతా 8వ పేజీలో...

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 28: ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. మండలంలోని ఎదిర, సూరవీడు, ఉప్పేడు, ఆలుబాక గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. రూ.కోటి 10 లక్షల నిధులతో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మిస్తున్న సీసీరోడ్ల పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఎన్నికల్లో ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించారని, ఈప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నూగూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, నాయకులు గుడవర్తి నర్సింహమూర్తి, ముడుంబ శ్రీనివాస్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

బావిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మేడారం, ఫిబ్రవరి 28 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం జంపన్నవాగులోని ఊట బావిలో దిగి నీట మునిగిన వ్యక్తి మృతదేహం బుధవారం లభ్య మైంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లా విసన్నపేటకు చెందిన అద్దం కి అంజి (35) మేడారం మహాజాతరలో కూలి పనుల నిమిత్తం వచ్చాడు. మంగళవారం జంపన్నవాగులో స్నా నం చేస్తూ సరదాగా బంతితో ఆడుతున్నాడు. ఊట బావి లో బంతి పడగా దాన్ని తీయడానికి అందులో దిగి గల్లం తయ్యాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.

గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. పోస్టుమార్టం అనంత రం మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్ప గించారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

జులాజికల్ పార్కు తనిఖీ

సుబేదారి, ఫిబ్రవరి 28: హనుమకొండలోని కాకతీయ జులాజికల్ పార్కును రాష్ట్ర పర్యావరణ, అటవీ, టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎ. వాణిప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. జులాజికల్‌పార్కుతో పాటు హరితనిధి, కేయూ నర్సరీని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెక్రెటరీ వాణిప్రసాద్ జూపార్కు అధికారులకు, సిబ్బందికి వణ్యప్రాణుల సంరక్షణకై పలు సూచనలు చేశారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంట ఫారెస్టు అధికారులు శివానీ డోగ్రా, బి. లావణ్యతో పాటు ఎఫ్ఆర్‌వోలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

శివరాత్రికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న భద్రకాళి శేషు, రాకేష్‌రెడ్డి

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 28: సనాతన ధర్మ విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడానికి శివరాత్రికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు భద్రకాళి అమ్మవారి ప్రధానార్చకుడు శేషు అన్నారు. ప్రతీ ఏటా నిర్వహించినట్లుగానే ఈ యేడు ఇండస్ ఫౌం డేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో మహా శివరాత్రి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇలాంటి చైతన్యవంతమైన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శేషుతో పాటు ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి చేతుల మీదుగా సమ్మేళన కరపత్రాన్ని ఆవిష్కరించారు. పరశివుడి ఔనత్యాన్ని చాటడానికి ఇండస్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓరుగల్లు శివతత్వానికి పెట్టిన పేరని అలాంటి నగర విశిష్ఠతను తెలియజేయడమే ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్న విశిష్ఠ వ్యక్తులకు కాకతీయ పురస్కారం ఇచ్చి గౌరవించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ పార్వతి కల్యాణం, బ్రహ్మ శ్రీ గంగాధర శాస్త్రి, రాధామనోహర్ దాస్ ప్రవచనాలు, సప్తహారతి, పేరిణి శివతాండవంతో పాటు ప్రముఖ సినీ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్, శరణ్ అర్జున్, వివిధ సినీ జానపద కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఇంకా మహా శివరాత్రి కార్యక్రమ నిర్వాహక కో ఆర్డినేటర్ కత్తుల అభిషేక్, వెలగందుల దీపక్ తదితరులు పాల్గొన్నారు.

‘మేడిగడ్డ’ మే సవాల్!

(5వ పేజీ తరువాయి)

ప్రజల్లోకి వెళుతోందని, కౌంటర్ అటాక్ చేయాలని గులాబీ పార్టీ భావిస్తోంది. దీంతో మార్చి 1వ తేదీన చలో మేడిగడ్డ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కాళేశ్వ రం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే కాదని వాదిస్తోంది. కేవలం మూడు వేల కోట్లు వెచ్చించిన మేడిగడ్డ బ్యారేజీలోని మూడు పిల్లర్లు కుంగితే.. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదని కాంగ్రెస్ రాద్ధాంతం చేస్తోం ది. బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. కుంగిన పిల్లర్లను మరమ్మతు చేసి, కాళేశ్వరం ద్వారా రైతులకు సాగు నీరు అందించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తూ చలో మేడిగడ్డ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి మేడిగడ్డ పర్యటనకు గులాబీ పార్టీ ప్లాన్ చేస్తోంది. మార్చి 2వ తేదీన కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి కాంగ్రెస్‌కు కౌంటర్ ఇవ్వాలని భావిస్తోంది. ఈ సభలో స్వయంగా కేసీఆర్ మేడిగడ్డపై మాట్లాడనున్నారు. అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగితే.. అప్పటి నుంచి ఈ ఘటనపై కేసీఆర్ స్పందించలేదు. అయితే కరీంనగర్ సభలో కేసీఆర్ మేడిగడ్డపై మాట్లాడనుండటంతో గులాబీ శ్రేణుల్లో ఆసక్తికరంగా మారింది.







సారలమ్మ గద్దె వద్ద..



సమ్మక్క గద్దె వద్ద..



ఘనంగా తిరుగువారం





మేడారం మహాజాతరలో చివరిఘట్టం పూర్తి

ప్రత్యేక పూజలు చేసిన వడ్డెలు.. భారీగా హాజరైన భక్తులు

మేడారం, ఫిబ్రవరి 28 : మేడారం మహాజాతర అత్యంత వైభవంగా జరిగింది. ఈ క్రమంలో సంప్రదాయం ప్రకారం చివరిఘట్టంగా నిర్వహించే తిరుగువారం పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనదేవతలకు వడ్డెలు (పూజారులు) ప్రత్యేక పూజలు చేశారు. గద్దెలు, గ్రామంలోని గుడిని శుద్ధి చేశారు. ఆడపడుచులు.. అలుకుపూతలతో రంగురంగుల ముగ్గులు వేసి అందంగా అమ్మవార్ల గద్దెలను అలంకరించారు. అనంతరం డోలు వాయిద్యాల నడుమ తల్లులకు ధూపదీప నైవేద్యాలు సమర్పించగా.. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని యాటమొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం తల్లుల వన ప్రదేశాలకు వెళ్లి రహస్య పూజలు చేశారు. కన్నెపల్లిలో సారలమ్మ గుడిలో మేడారంలో సమ్మక్క గుడిలో, కొండాయిలో గోవిందరాజు గుడిలో, పునుగొండ్లలో పగిడిద్దరాజు గుడిలో ఈ పూజలు జరగ్గా.. పూజారులు కుటుంబీకులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఉపాధ్యక్షుడు కాక సారయ్య, పూజారులు కాక కిరణ్, కాక వెంకటేశ్వర్లు, సిద్దబోయిన మునీందర్, అరుణ్, అనిల్, కొక్కెర కృష్ణయ్య, రమేష్, పూర్ణచందర్, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

ముగిసిన జాతర.. భారీగా తరలొచ్చిన భక్తులు

ఈ నెల 7న గుడిమెలిగే పండుగ మొదలుకొని 14న మండమెలిగే పండుగ, 21, 22న వన దేవతలు గద్దెలకు చేరడం, 23న భక్తుల మొక్కులు, 24న వన ప్రవేశం జరిగింది. తదుపరి బుధవారం జరిగే తిరుగు జాతర పండుగ ముగియగా.. తిరుగువారం రోజున కూడా తల్లులు ఇక్కడే కొలువు దీరి ఉంటారనే నమ్మకంతో భక్తులు మేడారానికి పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు జంపన్న వాగులో స్నానాలు ఆచరించి తల్లులకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



సమ్మక్కగుడిలో ముగ్గులు వేస్తున్న మహిళలు



సమ్మక్కగుడిలో పూజలు చేస్తున్న వడ్డెలు

ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే

మీ భరతం పడతా

- అమ్మను అడ్డుపెట్టుకుని పొన్నం రాజకీయం చేస్తున్నాడు
- పీవీ ఇంటికెళితే కడుపు మండిన కాంగ్రెసోళ్లు నాపై కోడిగుడ్ల దాడి చేశారు
- పాదయాత్రలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



ఎల్కతుర్తిలో పాదయాత్ర చేస్తున్న బండి సంజయ్

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 28 : ఇచ్చిన హామీ మేరకు 100రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయకపోతే ఆ పార్టీ నాయకుల భరతం పడతానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హెచ్చరించారు. ఆయన చేపట్టిన ప్రజాహిత పాదయాత్ర బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో కొనసాగి.. రాత్రికి ఎల్కతుర్తి మండలంలోకి చేరుకుంది. మండలంలోని గోపాల్‌పూర్, చింతలపల్లి, దామెర, ఎల్కతుర్తి, సూరారం, దండేపల్లి గ్రామాల్లో పాదయాత్ర సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. పదేళ్లలో కేసీఆర్ రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల అప్పులు చేస్తే అధికారం వచ్చిన 80రోజుల్లోనే కాంగ్రెసోళ్లు రూ.10వేల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ప్రజలు కాంగ్రెస్ నాయకులను తరిమి కొడతారని, తెల్ల రేషన్‌కార్డులున్న వారికే గ్యారెంటీలను అందిస్తామని చెప్పడం ప్రజలను తప్పు దోవ పట్టించడమేనని విమర్శించారు. రేషన్ కార్డులే ఇవ్వని ప్రభుత్వం గ్యారెంటీలను ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. రాముడి జన్మస్థలాన్ని ప్రశ్నించే వాళ్లను నేను నిలదీస్తే.. తన తల్లిని అవమానించానంటూ.. తల్లిని అడ్డుపెట్టుకుని ఈ ప్రాంత మంత్రి రాజకీయం చేస్తున్నాడని మంత్రి పొన్నం ప్రభాకర్‌పై పరోక్ష ఆరోపణలుచేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తే అది ఆయన విజ్ఞతేనని, ఏ మూర్ఖుడు కూడా అమ్మను అడ్డుపెట్టుకుని విమర్శలు చేయరని గుర్తుచేశారు. ఈ ప్రాంతానికి చెందిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు మృతి చెందితే ఆయన భౌతిక కాయాన్ని కూడా పూర్తిగా కాలనీయని పరిస్థితి తీసుక వచ్చిన చరిత్ర కాంగ్రెస్ వాళ్లది కాదా అని ప్రశ్నించారు. అలాంటి వ్యక్తి సేవలను గుర్తించి.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పీవీ నర్సింహారావుకు భారతరత్నను ప్రకటించి గౌరవించిందన్నారు. అలాంటి వ్యక్తి కుటుంబాన్నికలిసేందుకు స్వగ్రామానికి వెళ్లితే కడుపు మండిన కాంగ్రెస్ నాయకులు తనపై కోడి గుడ్లతో దాడిచేశారని, రాళ్లు, కోడి గుడ్ల దాడులకు తాను భయపడే వ్యక్తిని కాదని, తనను అనవసరంగా గెలికారని, తాను కేసీఆర్‌కే భయపడలేదన్నారు. గతంలో కేసీఆర్ తెలంగాణను నాశనం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం సర్వనాశనం చేయడానికి కంకణం కట్టుకుందని మండిపడ్డారు. అగ్ర వర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా కేంద్రంలో 27 మంది బీసీలను, 12 మంది ఎస్సీలను, 8 మంది ఎస్టీలను కేంద్ర మంత్రులకు పట్టం కట్టిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కిందన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నియోజక వర్గ నేతలు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, గుజ్జ సత్యనారాయణరావు, మండల పార్టీ అధ్యక్షుడు కుడితాడి చిరంజీవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంజయ్ కాన్వాయ్‌పై

కోడిగుడ్లతో దాడి

- హనుమకొండ జిల్లా వంగరలో ఉద్రిక్తత





వంగరలో పోలీసులపై అసహనం వ్యక్తం చేస్తున్న ఎంపీ బండి సంజయ్ (ఇన్‌సెట్‌లో కోడి గుడ్ల దాడిలో కింద పడిన గుడ్డు)

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 28: ప్రజాహిత పాదయాత్రలో భాగంగా మంగళవారం రాత్రి సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం నుంచి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోకి అడుగుపెట్టిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కొత్తకొండలోని హరితహోటల్‌లో రాత్రి బసచేశారు. అయితే పీవీకి భారతరత్న వచ్చిన నేపథ్యంలో బుధవారం ఉదయం ఆయన వంగరలోని పీవీ కుటుంబ సభ్యులను కలిసి.. పీవీ ఇంట్లోని పీవీ విగ్రహానికి నివాళులర్పించి, పీవీ మనువడు ఎన్వీ సుభాష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వంగర నుంచి భీమదేవరపల్లికి వెళ్తుండగా వంగర బస్టాండ్ సమీపంలో బండి సంజయ్ కాన్వాయ్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కోడిగుడ్లు విసిరారు.

ఈ క్రమంలో బండి సంజయ్ పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి తాను బస చేసిన కొత్తకొండ హరిత హోటల్ వద్ద వందలాది మంది పోలీసులు మోహరించారని, కానీ బుధవారం తాను వంగరలో పీవీ ఇంటికి వెళ్లివస్తుండగా తన కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి జరగడం తీవ్ర బాధాకరమన్నారు. పోలీసుల వైఫల్యంతోనే తన కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి జరిగిందని ఆరోపించారు. పోలీసులు, ఇంటెలిజెన్స్ వైఫల్యమే దీనికి కారణమన్నారు. తమ కార్యకర్తలు బుధవారం ఉదయం వంగరలో అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉందని అప్రమత్తం చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. దీంతో తన కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి జరిగిందని ఆరోపించారు. తనకు పోలీసుల బందోబస్తు అవసరం లేదని, తమ కార్యకర్తలకే తనకు రక్షణగా ఉంటారని, పోలీసులు తిరిగి వెళ్లిపోవాల్సిందిగా ఆయన కోరారు. ఆ తర్వాత అక్కడి నుంచి బండి సంజయ్ వెళ్లిపోగా.. కోడిగుడ్ల దాడి జరిగిన క్రమంలో వంగరలో ఉద్రిక్తత ఏర్పడింది.

మేడారం వైభవం వెయ్యేళ్లు గుర్తుండేలా కృషి

- అధికారుల సమన్వయంతో జాతర విజయవంతమైంది
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడి



ములుగు కలెక్టర్, ఎస్పీలను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, ఫిబ్రవరి 28: మేడారం సమ్మక్క, సారలమ్మల చరిత్ర, మహాజాతర వైభవం వెయ్యేళ్లు గుర్తుండేలా కృషి చేస్తామని, జాతర సమగ్రాభివృద్ధికి పక్కాప్రణాళిక రూపొందిస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లాలో పర్యటించిన సీతక్క జాకారంలోని వైటీసీ భవనాన్ని పరిశీలించారు. రామప్ప నుంచి లక్నవరం సరస్సులోకి గోదావరి జలాల తరలింపుపై జిల్లా కలెక్టర్, నీటిపారుదలశాలక అధికారులతో చర్చించారు. ఆ తర్వాత మేడారం జాతర విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ములుగులోని గిరిజన భవన్‌లో కృతజ్ఞత సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తన 24ఏళ్ల రాజకీయ జీవితంలో పలుమార్లు మేడారం జాతర నిర్వహణను పరిశీలించానని, కానీ, తొలిసారి ప్రభుత్వ ప్రతినిధిగా ప్రత్యక్షంగా జాతరను జరిపించే అవకాశం లభించడం తన అదృష్టమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజులకే వచ్చిన మేడారం జాతరకు రెండు దఫాలుగా రూ.105కోట్ల నిధులు విడుదల చేసి యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేశామని, కలెక్టర్, ఎస్పీ, అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకొని జాతరను విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. కొన్ని లోపాలు తలెత్తాయని, వాటిని వచ్చే జాతరలో పునరావృతం కాకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపడుతామని, జాతర సమగ్రాభివృద్ధి, భక్తులకు శాశ్వత ప్రాతిపదికన మౌలిక సదుపాయాల కల్పనకోసం ప్రణాళిక రూపొందిస్తామన్నారు. అధికారుల అనుభవాలను పుస్తక రూపంలో పొందుపరుస్తామని, గత జాతరతో పోల్చుకుంటే ఈసారి భక్తుల సంఖ్య పెరిగిందని, అయినా అధికారుల సమయ స్ఫూర్తితో వ్యవహరించి వసతులు కల్పించారన్నారు. జాతీయ గిరిజన విశ్వవిద్యాలయంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, తరగతుల నిర్వహణకు జాకారంలోని వైటీసీ భవనంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిధుల కేటాయింపునకు సీఎం అంగీకరించారని, యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతామన్నారు. రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్ కోసం భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ... మీడియాలో విస్తృత ప్రచారం జరగడంతో మేడారం జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని, కవరేజీ కోసం నూతనంగా మీడియా టవర్‌ను నిర్మించామన్నారు. ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ.. స్వల్ప ట్రాఫిక్‌జామ్ మినహా జాతరను సక్సెస్ చేశామని, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా, గద్దెలు, జాతర పరిసరాల్లో రద్దీ నియంత్రణపై పక్కాగా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క కలెకర్, ఎస్పీ, ఆయా శాఖల అధికారులు, ములుగు జిల్లా మీడియా ప్రతినిధులను జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, మేడారం ఈవో రాజేంద్రం, పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్, ములుగు డీపీఆర్‌వో ఎమ్డీ.రఫిక్, ములుగు డీఎస్పీ రవీందర్, తహసీల్దార్ విజయభాస్కర్, ఇన్‌చార్జి డీపీవో తుల రవి, సీఐ రంజిత్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు

హనుమకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రెవెన్యూశాఖలో పెద్ద ఎత్తున బదిలీలు జరిగా యి. బుధవారం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిత్తల్ ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 40మంది రెవెన్యూ అధికారులు బదిలీ అయ్యారు. సుదీర్ఘకాలం పాటు ఒకే చోట పని చేస్తున్న అధికారులకు స్థాన చలనం జరిగింది. సూర్యాపేట అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా పనిచేస్తున్న అ్రమాడ వెంకట్ రెడ్డిని హనుమకొండ అడిషనల్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

హనుమకొండ అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ ములుగు అడిషనల్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ప్రస్తుతం ములుగు అడిషనల్ కలెక్టర్‌గా పని చేస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డి.వేణుగోపాల్ భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ కలెక్టర్‌గా, పరకాల ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి కల్లూరు ఆర్‌డీవోగా, ఆదిలాబాద్ ఆర్‌డీవోగా పని చేస్తున్న స్రవంతి బ్రహ్మారౌతు వరంగల్ ఆర్‌డీవో, ఆర్మూర్ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ టి.వినోద్‌కుమార్ భూపాలపల్లి ఎల్‌ఏ అండ్ ఆర్‌ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, భూపాలపల్లి ఆర్‌డీవోగా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె.రమాదేవి మెదక్ ఆర్‌డీవోగా, వరంగల్ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎం.వాసుచంద్ర నారాయణ్‌పేట్ ఆర్‌డీవోగా, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ వి రామ్మూర్తి ఏటూరునాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గిరిజన సంక్షేమం)గా, హనుమకొండ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎల్.రమేష్ సిరిసిల్ల ఆర్‌డీవోగా బదిలీ చేశారు.

హైదరాబాద్ స్పెషల్ ఎగ్జిగ్యూటివ్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ డి.కొమురయ్య జనగామ ఆర్‌డీవోగా, జనగామ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణారెడ్డి హైదరాబాద్ సెక్రెటరియేట్‌లో అధికార భాష ఇన్స్‌పెక్టింగ్ ఆఫీసర్‌గా, ఏటూరునాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (టీడబ్ల్యు) డిప్యూటీ కలెక్టర్ డీఎస్ వెంకన్న స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డీవోగా, నారాయణ్‌ఖేడ్ ఆర్‌డీవోగా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎస్.వెంకటేశ్ హనుమకొండ ఆర్‌డీవోగా, భూపాలపల్లి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్‌ఏ, ఆర్అండ్ఆర్‌గా పనిచేస్తున్న కె.నారాయణరెడ్డి పరకాల ఆర్‌డీవోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మల్టీజోన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల ట్రాన్స్‌ఫర్

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 28: రాష్ట్ర పోలీసు విభాగం మల్టీ జోన్ -1 పరిధిలో ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ మల్టీ జోన్ -1 ఐజీ ఏవీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జోన్ పరిధిలో 65 మందిని బదిలీ చేయగా పోలీసు కమిషనరేట్ నుంచి 7 గురు బదిలీ అయ్యారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఒ. రమేష్	వరంగల్ ఎస్బీ	కరీంనగర్ - 2 టౌన్
సీహెచ్ శ్రీధర్	వరంగల్	సరెండర్ మల్టీ జోన్ -1
ఎన్.వెంకట్రామ్‌నాయక్	వరంగల్	సరెండర్ మల్టీ జోన్ -1
బి. శంకర్	సీసీఎస్ వరంగల్	సరెండర్ మల్టీ జోన్-1
ఎం. శివకుమార్	సిద్దిపేట	వరంగల్ కమిషనరేట్
ఎస్. రవికుమార్	మల్టీజోన్ -1	వరంగల్ కమిషనరేట్
పులి వెంకటి	వరంగల్	హుజూరాబాద్ రూరల్

జాతీయ లోక్‌అదాలత్‌కు సహకరించండి

• బార్ సభ్యులతో జిల్లా జడ్జి లలిత శివజ్యోతి



బార్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: ములుగులోని జిల్లా కోర్టులో మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు బార్ అసోసియేషన్ సహకరించాలని జిల్లా జడ్జి పి.వి.పి.లలిత శివజ్యోతి అన్నారు. కోర్టు ఆవరణలో ములుగు బార్ అసోసియేషన్ సభ్యులతో ఆమె బుధవారం సమావేశమయ్యారు. జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి బార్ అసోసియేషన్ సభ్యులు సహకరించడంతోపాటు రాజీపడదగే కక్షిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి టి.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్‌రెడ్డి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సౌఖ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాలాచారి, జనరల్ సెక్రటరీ మేకల మహేందర్, న్యాయవాదులు వినయ్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, కె.రవీందర్, సునీల్ కుమార్, స్వామి దాస్, రాజ్‌కుమార్, అర్చన, సుస్మిత, ప్రతాప్, చిరంజీవి, నవత, నరేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీగా మండల వాసి



కృష్ణ స్వామి

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 28: తెలంగాణ హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా (ఏజీపీ) మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన రేళ్ల కృష్ణస్వామి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణస్వామి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబీఏ, ఎల్ఎల్‌బీ, పీజీ డీసీఎల్ పూర్తి చేశారు. బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా 2017లో పేరు నమోదు చేసుకుని ఏడేళ్లుగా హైకోర్టులో కొనసాగుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

టేకుమట్ల, ఫిబ్రవరి 28: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు మండలంలోని రామకిష్టాపూర్(వీ) బుధవారం పట్టుకున్నారు. గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నాడనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని మార్కండేయ కాలనీకి చెందిన చింతల అర్జున్ అనే వ్యక్తి రేషన్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. అతడి నుంచి మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇళ్ల అక్రమ నిర్మాణాల అడ్డగింత

కాటారం, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలో అక్రమంగా చేపడుతున్న ఇళ్ల నిర్మాణం పనులను అధికారులు బుధవారం అడ్డుకున్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఇళ్ల నిర్మాణదారులకు నోటీసులు అందించారు. ఎంపీడీవో కార్యాలయం వెనక కట్టిన రేకుల షెడ్డును తహసీల్దార్ నాగరాజు తొలగింపజేశారు. సెంట్రింగ్ చెక్కను జీపీ కార్యదర్శి సమీర్‌ఖాన్ తొలగించారు. అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేపడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

వైద్య ఆరోగ్య శాఖలో నియామకాలు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్‌మిషన్ విభాగంలో 46 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఈపోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పిల్లల వైద్యనిపుణులు-1, వైద్యాధికారులు-4, స్టాఫ్‌నర్సు-27, వీసీసీఎం-1, ఎంఎల్‌హెచ్‌పీ-8, డీపీఎం-1,డీడీఎం-1, ఫార్మసిస్టు(ఆర్‌బీఎస్‌కే)-1, ఫార్మసిస్టు(టీడీ హెచ్‌యూబీ)-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అభ్యర్థులు ఈనెల 29న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు హెచ్‌టీటీపీఎస్://ములుగు.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



మంగపేటలో సైన్స్‌డే పాల్గొన్న విద్యార్థులు, అధికారులు, ఉపాధ్యాయులు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: ములుగులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్, భౌతికశాస్త్ర ఆచార్యులు కె.రజనీలత ఆధ్వర్యంలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో ఎదురైన సమస్యలను అధిగమిస్తూ సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని, భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సమ్మయ్య, రమేష్‌చంద్ర శ్రీకాంత్, వెంకన్న, విజిత, అనిల్, శంకర్, యుగంధర్, జి.మహేందర్, ఉమాదేవి, నాగమణి, ఉదయశ్రీ, తేజోలత, శ్రీనివాస్, మౌలానా, రమేష్ పాల్గొన్నారు. ములుగు మండలంలోని అబ్బాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్.హనుమాన్ అధ్యక్షతన జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు జరిగాయి. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కందాల రామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభావతి, సురేందర్, పాపిరెడ్డి, శ్రీధరచారి, శ్రీదేవి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

• వెంకటాపూర్(రామప్ప): మండలకేంద్రంలోని వేదవ్యాస ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పోశాల వీరమల్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించారు. పాఠశాల డైరెక్టర్లు సూర్యప్రకాశ్, ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• తాడ్వాయి : మండలకేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు రేగ కేశవరావుకు ఎంఈవో సాంబయ్య, ఉపాధ్యాయులు అవార్డును ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు భూక్య బాబూరావు, సుతారి పాపారావు, చంద్రారెడ్డి, స్వామి, రవీందర్, రజిత, రేణుక, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

• కాటారం : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సైన్స్‌ఫేర్‌ను నిర్వహించగా పలువురు ఎగ్జిబిట్లను తిలకించారు. కస్తూర్బా విద్యాలయంలో సీవీరామన్ జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయంపై విద్యార్థులు నాటకాలు, స్కిట్లు వేశార ఈ కార్యక్రమంలో కస్తూర్బా ఎస్‌వో సునీత, హెచ్ఎంలు కార్తీక్‌రావు వెంకటేశ్వర్లు, శ్రీశైలం, వెంకటేశ్ గౌడ్, శ్రీనివాస్, ఉమారాణి, శ్రీదేవి, శైలజ, విజయలలిత, రాజబాబు, మధు, శ్రీనివాస్, రాజబాపు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• మంగపేట : మండల కేంద్రంలోని కేజీబీవీ నూతన భవనంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జ్వల స్వచ్ఛందం సంస్థ, మండల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండలస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 210 ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని, జిల్లా సైన్స్ అధికారి అప్పాని జయదేవ్ హాజరై బహుమతులను అందజేశారు. జ్వాల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడేల నరేష్, గౌరవ అధ్యక్షుడు కొలగట్ల నరేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేష్, ఉపాధ్యక్షుడు పి.అజయ్, కార్యదర్శి ఎ. సతీష్, కోశాధికారి కె.నగేష్, మండల నోడల్ అధికారులు గడ్డి శ్రీనివాస్, పి.మేనక, ఆయా పాఠశాల హెచ్ఎంలు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సమగ్రంగా చేపట్టాలి

• డీపీవోతో మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 28 : తాడ్వాయి మండలం మేడారంలో పారిశుధ్య పనులను సమగ్రంగా చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మేడారంలో ఆమె బుధవార పర్యటించారు. సమ్మక్క, సారలమ్మ గద్దెల పరిసరాల్లోని పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ సమావేశ హాల్‌లో ఈ సందర్భంగా డీపీవో వెంకయ్య సమావేశమయ్యారు. మేడారంలో పారిశుధ్య పనులు పటిష్ఠంగా చేపట్టాలని సూచించారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా జాతర పరిసరాలు శుభ్రం చేయాలన్నారు. అనంతరం వనదేవతల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా తిరుగువారం పండుగ సందర్భంగా పూజరుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఇంటికి వెళ్లి ఆతిథ్యం తీసుకున్నారు. గుండెపోటుతో మృతి చెందిన పూజారి సిద్ధబోయిన దశరథం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మంత్రి వెంట మేడారం ఉత్సవ కమిటీ చైర్మన్ అర్రెం లచ్చుపటేల్, అధికారులు, పోలీసులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



దశరథం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

ఎమ్మెల్యే వెంకట్రావ్ విస్తృత పర్యటన

రూ. 1.20 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వాజేడు, ఫిబ్రవరి 28: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ మండలంలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఎన్ఆర్ ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.1.20కోట్లతో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మురుమూరు, దూలాపురం, గుమ్మడిదొడ్డి, చీకుపల్లి, పెదగొల్లగూడెం, చెరుకూరు, చింతూరు, పేరూరు, టేకులగూడెం, కృష్ణాపురం, వాజేడు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. వాజేడు మండల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేకు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. సంబంధిత అధికారులతో ఆయన ఫోన్లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ప్రతి నెలా మండలంలో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కోటేశ్వరరావు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమళ్ల రామాకృష్ణారెడ్డి, మాజీ ఎంఎసీ చైర్మన్ బుచయ్య, కోఆప్షన్ సభ్యుడు నిజాముద్దీన్, మాజీ ఎంపీపీ స్వరూప, మాజీ సర్పంచ్‌లు జయలక్ష్మి, మేనక, బుల్లెశ్వరరావు, సరస్వతి, నాగచంద్ర, సాంబయ్య, పూసం నరేష్, నాయకులు చెన్నం ఎల్లయ్య, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పెదగొల్లగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అడవిలో ఇష్టారాజ్యం!



మట్టిని తవ్వి తరలిస్తున్న ఫారెస్టు అధికారులు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 28 : అడవులను కాపాడాల్సిన వారే వాటి విధ్వంసానికి కారకులవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నర్సరీల ఏర్పాటు పేరుతో అటవీ ప్రాంతంలో ఫారెస్టు అధికారులు యథేచ్ఛగా మట్టిని తవ్వడం, ఈ క్రమంలో వనసంపద ధ్వంసం కావడం విమర్శలకు తావిస్తోంది. ఏటూరునాగారం మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు సమీపంలో నర్సరీ ఏర్పాటు పేరిట అడవిలో జేసీబీ యంత్రాల ద్వారా మట్టిని ఫారెస్టు అధికారులు తవ్విస్తూ ట్రాక్టర్ల ద్వారా తరలించడంపై పలువురు గిరిజనులు ఆక్షేపిస్తున్నారు. నర్సరీ ఏర్పాటు అవసరాల కు ప్రభుత్వం నుంచి అనుమతులు పొంది క్వారీల నుంచి మట్టిని తెచ్చుకోవాల్సి ఉండగా అటవీశాఖ అధికారులు 'మా అడవి.. మా ఇష్టం' అన్నట్టు ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఏటూరునాగారం అభరణ్యంలో ఎర్రమట్టిని విచ్చలవిడిగా జేసీబీ యంత్రాల సాయంతో తవ్వుతూ ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని అంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఒకరికి తీవ్రగాయాలు



ప్రమాద స్థలిలో క్షతగాత్రుడు కిష్టయ్య

కాటారం, ఫిబ్రవరి 28: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంథని వైపు నుంచి భూపాలపల్లికి బయల్దేరింది. మహాముత్తారం మం డలం పెగడపల్లికి చెందిన రామగిరి కిష్టయ్య కాటారంలోని బంధువుల ఇంటికి బైక్‌పై వచ్చి తిరుగు ప్రయాణమయ్యాడు. మెయిన్ రోడ్డుపై నుంచి వెళ్తుండగా బైక్‌ను బస్సు ఢీకొంది. దీంతో కిష్టయ్య రోడ్డుపై ఎగిరిపడగా తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై-2 సురేష్ క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రయాణికులను వేరే బస్సులో గమ్యస్థానాలకు పంపారు. కిష్టయ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిసింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : డీఎస్పీ



డైరీని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాటారం, ఫిబ్రవరి 28: చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, తద్వారా నేర ప్రవృత్తికి దూరంగా ఉండొచ్చని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ ఆధ్వర్యంలో మహనీయుల జీవిత ముఖ్య ఘట్టాలతో పాటు పలు చట్టాలు, సెక్షన్లు, కేసులతో రూపొందించిన కేవీపీపీఎస్ డైరీని డీఎస్పీ బుధవారం ఆవిష్కరించారు. కేవీపీఎస్ డైరీ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తూ యువతను సన్మార్గంలో నడిపించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, సుధాకర్, రజనీకాంత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కట్టడాలను అడ్డుకున్న అధికారులు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురంలో వెలిసిన కట్టడాలను రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు మంగళవారం అర్ధరాత్రి అడ్డుకున్నారు. అమ్మ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఏటూరునాగారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న స్థలంలో పలువురు అర్ధరాత్రి షెడ్ వేశారు. విషయం తెలుసుకున్న మండల రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు అక్కడికి చేరుకున్నారు. షెడ్‌ను అధికారులు తొలగిస్తుండగా వాగ్వాదం చోటుచేసుకుంది.



షెడ్ సామగ్రిని తరలిస్తున్న అధికారులు

ఓటరుగా నమోదు చేసుకోవాలి

జడ్పీ సీఈవో విజయలక్ష్మి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 28: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని జడ్పీ సీఈవో విజయలక్ష్మి అన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో ఆమె బుధవారం సమావేశమయ్యారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఫారం-6 ద్వారా ఓటరుగా పేరు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. దీనిపై యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి అవినాష్, భూపాలపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి 'చలో కొత్తగూడెం'ను విజయవంతం చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

కాకతీయఖని, ఫిబ్రవరి 28: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న మైనింగ్ స్టాఫ్ సమస్యలపై గురువారం కొత్తగూడెంలోని హెడ్ ఆఫీస్ వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కోరారు. భూపాలపల్లి పట్టణంలోని కొమురయ్య భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల పట్ల వివక్ష చూపుతోందని విమర్శించారు. ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ రద్దుచేసి ఇంటర్నల్ నోటిఫికేషన్ వేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా మైనింగ్ సర్దార్లు ప్రమోషన్ లేకుండా ఉన్నారని, వారికి వెంటనే ఓవర్‌మెన్‌గా పదోన్నతులు కల్పించాలన్నారు. సింగరేణిలో షార్ట్ ఫైరర్ల కొరత ఉందన్నారు. కారుణ్యనియామకం ద్వారా ఎంపికైన యువ కార్మికుల్లో ఎంతో మంది డిప్లొమా పూర్తిచేశారని, వారిలో అర్హులను గుర్తించి సర్దార్, షార్ట్ ఫైరర్లుగా ప్రమోట్ చేయాలని అన్నారు. ఒక సంవత్సరంలో 60మస్టర్లు ఆబ్సెంట్ ఉంటే వారికి కేడర్ స్కీం వర్తించడంలేదన్నారు. అలాంటి షరతులను తొలగించాలని డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమంలో పాల్గొనే ఉద్యోగులపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోకూడదని యామాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోటపలుకుల రవేష్, సుధాకర్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన అధికారులు

వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని మొక్కల నర్సరీని డీఆర్‌డీవో శ్రీనివాస్, ఏపీడీ వెంకటనారాయణ, ప్లాంటేషన్ మేనేజర్ కిషోర్, ఏపీవో సునీత, ఈసీ సురేష్ బుధవారం పరిశీలించారు. ఎండల తీవ్రత పెరిగిన దృష్ట్యా నర్సరీ షెడ్‌నెట్ ఏర్పాటు చేయాలని, క్రమం తప్పకుండా మొక్కలకు నీళ్లు అందించాలని అన్నారు. ఎప్పటికప్పుడు కలుపు మొక్కలను తొలగించాలని సూచించారు. వారి వెంట టెక్నికల్ అసిస్టెంట్లు కుమారస్వామి, సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు రామాచారి, రాధిక, సారంగపాణి తదితరులు ఉన్నారు.

'మహాజాతరలో పోలీసుల సేవలు అభినందనీయం'

తాడ్వాయి, ఫిబ్రవరి 28: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరలో పోలీస్‌శాఖ భక్తులకు ఉత్తమ సేవలందించడం అభినందనీయమని గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్దబోయిన రవి అన్నారు. బుధవారం మండలకేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాజాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్‌శాఖ చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. త్వరలో ఏటూరునాగారం ఐటీడీఏలో పోలీసు అధికారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. సంఘం నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈసమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, నాయకులు చందా లింగయ్య, వట్టం నారాయణ, సత్యనారాయణ, ముక్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయ ఇన్‌చార్జ్ ఈవోగా మారుతి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ఈవో మారుతి

మహదేవపూర్, ఫిబ్రవరి 28: మండలంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా మారుతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాళేశ్వరం ఈవోగా ఉన్న మహేశ్ సెలవుపై వెళ్లడంతో దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అదనపు బాధ్యతలు స్వీకరించారు.

నేడు కలెక్టర్ సమన్వయ సమావేశం

మార్చిలో మహాశివరాత్రి జాతర జరనున్న నేపథ్యంలో జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించనున్నారు. వివిధ శాఖల అధికారులతో మధ్యాహ్నం 3 గంటకు ఆలయ వసతి గృహంలో సమావేశం కానున్నారని ఈవో మారుతి తెలిపారు.

నేడు ములుగులో బీజేపీ విజయ సంకల్ప యాత్ర

ములుగు, ఫిబ్రవరి 28: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప బస్సు యాత్ర ఈనెల 29న ములుగు జిల్లాలో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ములుగు మండలం మల్లంపల్లి వద్ద యాత్ర ప్రారంభమవుతుందని, జిలా కేంద్రంలో రోడ్‌షో, కార్నర్ మీటింగ్ జరుగుతుందని తెలిపారు. వెంకటాపూర్ మండలంలోని ప్రపంచ ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో రుద్రేశ్వరుడి దర్శనం అనంతరం యాత్ర భూపాలపల్లి జిల్లాలో కొనసాగుతుందని వెల్లడించారు. బీజేపీ శ్రేణులు, ప్రజల పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

ఇసుక వాహనాల పట్టివేత

చిట్యాల, ఫిబ్రవరి 28: మండలంలోని కాల్వపల్లి శివారు మానేరువాగు, నవాబుపేట చలివాగు నుంచి అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లు, టిప్పర్, లారీని బుధవారం పట్టుకున్నట్లు చిట్యాల ఎస్సై-2 షాఖాన్ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోందని సమాచారంతో సీఐ వేణుచందర్ ఆదేశాలతో స్థానిక పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి వాహన తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు. జడల్‌పేట క్రాస్, కైలాపూర్ క్రాస్ వద్ద అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్, లారీని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలిచినట్లు తెలిపారు. బానోతు వీరు, కోటి, గుగులోతు సమ్మయ్య, గంజి రజినీకాంత్, సాద రాజు, బండెల శివ, సతీష్, శివకుమార్, శ్రీనివాస్, బండ శ్రీకాంత్, బండెల రమేష్, పెరుమాండ్ల క్రాంతి, చెన్నవేణ మల్లేష్, సూర తిరుపతి, దుడ్డేటి రమేష్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను చూపుతున్న పోలీసులు

కానిస్టేబుల్ కుటుంబానికి బాసట

వాజేడు, ఫిబ్రవరి 28: ములుగులో రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందిన కానిస్టేబుల్ పోడెం కోటేశ్వరరావు కుటుంబానికి అతడి మిత్రులు బాసటగా నిలిచారు. భద్రాద్రి కొత్తగుడెం జిల్లాకు చెందిన మిత్రులు బుధవారం జరిగిన కోటి దశదిన కర్మలకు హాజరయ్యారు. అతడి కుటుంబానికి రూ. 2 లక్షల 5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరమైనా తాము ముందుంటామని భరోసా కల్పించారు. కోటితో ఉన్న అనుబంధాన్ని నెమరేసుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. సాయం అందించిన వారిలో జరిపుల అశోక్, భాగి రమేష్, యడలపల్లి రమేష్, భట్టు మంగయ్య, సుర్ణపాక హేమంత్, చంద్రశేఖర్, వసంత్, ప్రసాద్, సారయ్య, నరసింహరావు, రాజేష్, రామారావు, ప్రభాకర్, బాలు, వినోద్, వి.ప్రసాద్, తొలెం సుబ్బారావు, నర్సయ్య, గొంది సీతారాం తదితరులు ఉన్నారు.

దొంగల ముఠా అరెస్టు

(5వ పేజీ తరువాయి)

పాల్పడ్డారు. ఏనుమాములలోని కారల్‌మార్క్స్ కాలనీ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ఈ ముగ్గురిని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు చెప్పారన్నారు. వారిని అదుపులోకి తీసుకుని రూ.5.50 లక్షల సొత్తును స్వాధీన పర్చుకున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. దొంగల ముఠాను పట్టుకున్న ఏనుమాముల సీఐ పి.కిషన్, సీసీఎస్ సీఐ శంకర్‌నాయక్, ఎస్సై పోగుల శ్రీకాంత్, సీసీఎస్ ఎస్సై సంపత్‌కుమార్, కానిస్టేబుల్స్‌ను ఏసీపీ సతీశ్‌బాబు అభినందించారు.

దినసరి కార్మికుల సమ్మె నోటీసు

ఏటూరునాగారం రూరల్, ఫిబ్రవరి 28: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లోని దినసరి కార్మికులు సమ్మె బాట పట్టనున్నారు. ఇందులో భాగంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ఆధ్వర్యంలో ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచంను బుధవారం కలిసి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ 18నెలలుగా దినసరి కార్మికులకు వేతనాలు లేక అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. చాలీచాలని వేతనాలను కూడా సకాలంలో చెల్లించడం లేదన్నారు. 35 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికుల సర్వీస్‌ను గుర్తించడం లేదన్నరు. ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. జీవో 60 ప్రకారం రూ. 15,600 వేతనాలను ప్రతి కార్మికుడికీ అందజేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కారుణ్య నియామకాలను చేపట్టాలన్నారు. పీఎఫ్ డబ్బులను కార్మికుల అకౌంట్లలోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం చెల్లించే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బడే సులోచన, కమల, శాంతమ్మ, సంతోష, నారాయణ, సూర్యతేజ, అంకుశ, తదితరులు పాల్గొన్నారు.